ఎస్కేడీనగర్ నూతన కమిటీ ఎన్నిక

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణదేవరాయనగర్ (ఎస్కేడీ) కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమరేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, కన్వీనర్‌గా పుల్లారెడ్డి, కో కన్వీనర్‌గా బొమ్మ రఘురామ్ నేత, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్‌రావు, కోశాధికారిగా ఎన్‌వీ కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా పాపారావు, కేవీ రమణ, వి.నారాయణ, సంయుక్త కార్యదర్శిగా తులసీరెడ్డి, రూప్‌ల, నాగార్జునాచారి, ముఖేష్‌తో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో సమస్యలను పరిష్కరించి, అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

విజయశ్రీకాలనీ సీనియర్ సిటిజన్స్ ..

మన్సూరాబాద్: విజయశ్రీకాలనీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భీమిడి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వి.మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ బాలరాజు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సుధాకర్‌రెడ్డి, సతీశ్‌బాబు, జాయింట్ సెక్రటరీలుగా నరేందర్‌గౌడ్, గులాల్ రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా నల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా నర్సిరెడ్డి, మోహన్, ముత్యాలు ఎన్నికైనట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు.

సీనియర్ సిటిజన్స్‌కు క్రీడాపోటీలు

మన్సూరాబాద్: ప్రగతినగర్‌కాలనీలోని ఆదర్శ సీనియర్ సిటిజన్ సంక్షేమ భవనంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అసోసియేషన్ నేతలు వీరారెడ్డి, సత్యనారాయణ, సోమిరెడ్డి, బ్రహ్మారెడ్డి, రాంరెడ్డి, సత్యనారాయణరావు, నవనీతరావు, రామచంద్రారెడ్డి, అమృతారెడ్డి పాల్గొన్నారు.

డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడిగా మల్లేశ్‌యాదవ్



మల్లేశ్‌యాదవ్‌ను సత్కరిస్తున్న రంగారెడ్డి

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడిగా గెలమోని మల్లేశ్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఎరుకల మల్లేశ్‌గౌడ్, నాయకుల సమక్షంలో ఆదివారం మల్లేశ్‌యాదవ్‌కు నియామక పత్రం అందజేశారు. ముఖ్య అతిథిగా సీనియర్ నాయకుడు సామ రంగారెడ్డి హాజరై మల్లేశ్‌యాదవ్‌కు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం సామ రంగారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు.

ముందస్తు హౌస్ అరెస్టు

నాగోలు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లిపై బీహార్‌లో కాంగ్రెస్ నాయకులు చేసిన అసభ్యకరమైన, అవమానకరమైన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనకు నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ వెళ్లకుండా నాగోలు పోలీసులు ఆదివారం ఆమెను నివాసంలోనే ముందస్తుగా అరెస్టు చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజల గొంతుకను అణచివేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వం యత్నం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు.

గల్లంతైన వ్యక్తి.. శవమై తేలాడు



మహ్మద్ సలీం (ఫైల్)

నాగోలు: చాదర్‌ఘాట్ మూసీలో గత నెల 28న గల్లంతైన వ్యక్తి నగర శివారులోని మూసీలో శవమై తేలిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. నాగోలు సీఐ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నగర శివారులోని ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని కొర్రెముల మూసీ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు నాగోలు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు డీఆర్‌ఎఫ్ బృందాలు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా శంకర్‌నగర్‌కు చెందిన కూలీ మహ్మద్ సలీం (37) గా గుర్తించారు. సలీం స్థానికంగా మటన్‌షాప్‌లో లేబర్ పనిచేస్తున్నాడని ఇతని ముగ్గురు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ఈ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మన్సూరాబాద్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి కమలాసుధీర్‌రెడ్డి



భాగ్యలత, అరుణోదయనగర్ కాలనీ రోడ్ నం-3లో..



ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ టీ-జంక్షన్‌లో..



ఎల్బీనగర్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలో..



వాసవి కాలనీలో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ తదితరులు

గణనాథుడికి ఘనంగా పూజలు

వైభవంగా కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు

గణేశ్ నవరాత్రోత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం మండపాల వద్ద ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే పలుచోట్ల అన్నదానాలు చేపట్టగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– ఎల్బీనగర్, మలక్‌పేట్ జోన్ బృందం



వీరభద్రనగర్‌లో అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు



కొత్తపేటలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా తదితరులు



రాజప్పనగర్‌లో సుధీర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి



పసుమాముల గాయత్రీహిల్స్‌లో..



ఎల్బీనగర్‌లో..



వనస్థలిపురంలో శశిధర్, శ్రీనివాస్‌రెడ్డి..



వనస్థలిపురం శ్రీనివాసపురంలో..



చంపాపేట్‌లో..



బీఎన్‌రెడ్డినగర్‌లో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి..

ఉచిత కనెక్షన్‌కు డబ్బులు ఇవ్వాలా..?

కార్పొరేటర్‌కు ఎస్‌బీఐ కాలనీవాసుల మొర



కార్పొరేటర్‌కు సమస్యను విన్నవిస్తున్న ఎస్‌బీఐ కాలనీవాసులు

మలక్‌పేట: ఇంటింటికీ తాగునీటి నల్లా కనెక్షన్ ఇచ్చేందుకు పలువురు కాంట్రాక్టర్లు డబ్బులు వసూలు చేస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూసారంబాగ్ డివిజన్‌లో ఇటీవల రూ. 2.5 కోట్లతో ఎస్‌బీహెచ్ కాలనీ, ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలో రూ.51 లక్షల నిధులతో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులను మలక్‌పేట ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ప్రారంభించారు. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్, ఓ అధికారి కలిసి పైపులైన్ కనెక్షన్ ఇచ్చేందుకు ఒక్కొక్కరి నుంచి రూ. 20 వేల నుంచి 40 వేలు వసూలు చేస్తున్నారని, ఉచితంగా కనెక్షన్ ఇవ్వాల్సి ఉండగా..ఎందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని కాలనీవాసులు డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి ఎవరికీ రూపాయి ఇవ్వొద్దని, ఉచితంగా కనెక్షన్ ఇస్తారని అప్పటివరకు కాలనీలకు వాటర్ ట్యాంకర్లతో తాగునీరు అందిస్తామని వారికి హామీనిచ్చారు. అలాగు పై అధికారులతో మాట్లాడి వారిపై చర్యలు తీసుకునేలా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని పేర్కొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



ఎల్‌బీనగర్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, నేతలు



మన్సూరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తిని దూషిస్తున్న మౌనం వహించిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ వైఖరిని నిరసిస్తూ ఎల్‌బీనగర్ బీజేపీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎల్‌బీనగర్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ప్రధానమంత్రిని కాలేమో..అనే మీమాంసలో రాహుల్‌గాంధీ ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు నాంపల్లి రామేశ్వర్, నూతి శ్రీనివాస్, సుందర్‌నారాయణ, నాగిరెడ్డి, మల్లేశ్‌గౌడ్, ముత్యంరెడ్డి, విద్యాసాగర్, గంగదాసు కృష్ణారెడ్డి, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కామినేని చౌరస్తాలో..

రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కామినేని చౌరస్తాలో ఆదివారం నిరసన, ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సాయిరామ్‌గౌడ్, పాతూరి శ్రీధర్‌గౌడ్, అమరేశ్వర్, హరీశ్‌రెడ్డి, దామోదర్‌గౌడ్, సంతోష్‌గుప్తా, పరాంకుశం రోహిత్ పాల్గొన్నారు.

సరూర్‌నగర్ పోస్టాఫీస్ చౌరస్తాలో..

లింగోజిగూడ: డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గుంగె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ పోస్టాఫీస్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయభాస్కర్, ప్రవీణ్‌గౌడ్, రాకేశ్‌యాదవ్, మల్కాజిగిరి కుమార్, మల్కాజిగిరి నాగరాజు, శ్రీనివాస్, సంపత్, రాజ్‌విలక్ష్మణ్, సంతోష్, ధన్‌రాజ్, శ్రీను, శేషు, క్రాంతి పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

మలక్‌పేట: విద్యార్థులకు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి అన్నారు. సలీంనగర్ సెయింట్ డామ్నిక్స్ హైస్కూల్లో శనివారం నిర్వహించిన ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ ప్రోగ్రాన్ని ఆమె ప్రారంభించారు. మరోవైపు కొత్తపేట సెయింట్ మార్టిన్స్ హైస్కూల్, కర్మన్‌ఘాట్ డైసీ ఫ్లోరా హైస్కూల్ విద్యార్థులకు అండర్–14 అండ్ 16 ఖోఖో పోటీలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అంకితారెడ్డి, ధీరెన్, ఖమ్రుద్దీన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు



గణేశ్ విగ్రహాలకు జియో ట్యాగింగ్



చాదర్‌ఘాట్: ప్రతి గణేశ్ విగ్రహం లెక్క పక్కాగా ఉండేలా స్టేషన్ పరిధిలో జియో ట్యాగింగ్ చేస్తున్నామని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ మురారి తెలిపారు. స్టేషన్ పరిధిలో ఆదివారం 154 విగ్రహాలను జియో ట్యాగింగ్ చేశామని పేర్కొన్నారు. దీనిద్వారా ఏ విగ్రహం ఎక్కడ ఉందో పోలీసులకు పూర్తి సమాచారం ఉంటుందన్నారు. సంబంధిత విగ్రహానికి సంబంధించిన ఫొటోలు వివరాలను ట్యాబ్‌లో నమోదు చేస్తామన్నారు. ఎక్కడైనా ఏదైనా ఘటన జరిగినప్పుడు క్షణాల్లో ఆ ప్రాంతానికి వెళ్లేందుకు జియో ట్యాగింగ్ ఉపయోగపడుతుందన్నారు. అలాగే శోభాయాత్ర ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



నాగోలు: జైపురికాలనీ శ్రీ శక్తి కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా లైఫ్ స్ప్రింగ్ హాస్పిటల్ డాక్టర్ చింతల అమని కాలనీవాసులను పరీక్షించి మందులు అందజేశారు. అలాగే వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జైపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యామల యాదగిరి, మహిళలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



నాగోలు: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి సంరక్షించాలని లయన్స్ క్లబ్ సెకండ్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ డాక్టర్ అవంతిరెడ్డి అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో నాగోలులోని ఎస్‌టీపీలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడం వల్ల స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యం లభిస్తుండంతో పాటు భవిష్యత్తులో కలుషిత వాతావరణం తగ్గుతుందన్నారు. భీమిడి ఎస్ఎన్‌రెడ్డి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ లయన్ శ్రీధర్ బాబు, మల్లారెడ్డి, ఆకుల రవీందర్‌రావు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, సంఘం నేతలు

మన్సూరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో చట్ట సవరణ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర పెరిక క్షత్రియ కుల సంఘం ఆధ్వర్యంలో మన్సూరాబాద్ ఎంఈరెడ్డి గార్డెన్స్ సమీపంలోని గణేశ్‌నగర్ కాలనీ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్, పెరిక కుల కార్పొరేషన్ సాధకులు ముత్తినేని వీరయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజ్యాధికారం అందాలనే రాహుల్‌గాంధీ ఆలోచనలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కోట మల్లికార్జునరావు, సందరీవీరభాస్కర్, దాచెపల్లి రవి, ఎగ్గడి శ్రీనివాస్, మైలార్‌శెట్టి భాస్కర్, బల్దూరి రవి, లక్ష్మీనారాయణ, జూకూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: డివిజన్‌లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నానని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. జనప్రియ అపార్ట్‌మెంట్ల సముదాయంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, ఓపెన్ జిమ్, డ్రైనేజీ, ఫుట్‌పాత్‌ను కాలనీవాసులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో పిల్లల ప్లే పార్క్‌ను కూడా ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నాయకులు జ్యోతిరెడ్డి, జూపల్లి ప్రవీణ్, అనూష, లక్ష్మి, వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌చారి, రామలింగ, మానస తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



అక్బర్‌బాగ్‌లో నీటి కొలను పరిశీలిస్తున్న డీసీ అలీ, ఏఎంహెచ్‌ఓ శ్రీనివాస్

మలక్‌పేట: గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేశామని జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్–6 డీసీ ఎంఐకే అలీ తెలిపారు. ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్‌తో కలిసి బీ–బ్లాక్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆరు డివిజన్లలతో పాటు ప్రధాన రోడ్లకు మరమ్మతులు, శానిటేషన్, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే దారికి అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించామని పేర్కొన్నారు. మట్టి, చిన్న విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు బీ–బ్లాక్‌లోని అక్బర్‌బాగ్ వార్డు కార్యాలయం వద్ద, మూసారంబాగ్ డివిజన్ ఫ్రెండ్స్ కాలనీలో వార్డు కార్యాలయంలో నీటి కొలనులు నిర్మించామని తెలిపారు.

గంగమ్మ ఒడికి.. గణనాథుడు

పెద్ద చెరువులో కొనసాగుతున్న వినాయక నిమజ్జనాలు

మన్సూరాబాద్: పెద్ద చెరువు ప్రాంగణంలోని నిమజ్జన కొలనులో గణనాథుల నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో గణనాథులను శోభాయాత్రగా తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. కొలను వద్ద భారీ క్రేన్‌తో పాటు చిన్నపాటి క్రేన్‌ను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వనస్థలిపురం పోలీసులు బందోబస్తు చేపట్టారు. అలాగే జీహెచ్‌ఎంసీ అధికారులు 24 గంటల పాటు నిమజ్జనం సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. జలమండలి అధికారులు భక్తుల సౌకర్యార్థం తాగునీటిని అందిస్తున్నారు. మన్సూరాబాద్ ప్రభుత్వ పట్టణ హాస్పిటల్ సిబ్బంది శిబిరాన్ని ఏర్పాటు చేశారు.
మరోవైపు కొలనులో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాలను జీహెచ్‌ఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు వెలికితీసి వాహనాల్లో డంపింగ్ ప్రాంతానికి తరలిస్తున్నారు.



పెద్దచెరువు ప్రాంతంలోని కొలనులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



కొలనులోని నిమజ్జన వ్యర్థాలను క్రేన్‌తో బయటకు తీస్తున్న సిబ్బంది